క్లుప్తంగా

ఆర్‌కే ఓసీని సందర్శించిన జీఎం



ఓసీని పరిశీలిస్తున్న జీఎం

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కే ఓసీని ఏరియా జీఎం మనోహర్ గురువారం సందర్శించారు. ఓసీలో ఉత్పత్తి, ఉత్పాదకతల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కోల్‌వాషరీ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి సాధనకు సమష్టిగా కృషి చేయాలని, రక్షణ నియమాలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, మేనేజర్ వెంకటేశ్వర్లు, ఇంజినీర్ మహేందర్, సర్వే ఆఫీసర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పుర ప్రజాప్రతినిధులకు రూ.10వేల పెన్షన్ చెల్లించాలి

బెల్లంపల్లి: మున్సిపల్ ప్రజాప్రతినిధులకు నెలకు పెన్షన్ రూ.10వేల చొప్పున చెల్లించాలని రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఫోరం రాష్ట్ర చైర్మన్ బుక్య రాములునాయక్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నెల 29న రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుందని, సమావేశంలో తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. మున్సిపల్ ప్రజాప్రతినిధులకు కార్పొరేట్ వైద్యం అందించడానికి హెల్త్‌కార్డు మంజూరు చేయాలని, మేయర్, చైర్మన్‌కు నెలకు రూ.లక్ష, కార్పొరేటర్, కౌన్సిలర్లకు రూ.25వేల చొప్పున గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళా ప్రజాప్రతినిధులు వార్డులో ప్రజా సమస్యలను పర్యవేక్షించడానికి స్కూటీ సౌకర్యం కల్పించాలని, మున్సిపాలిటీల్లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను విడుదల చేయడానికి మంత్రి వర్గం తగిన నిర్ణయం తీసుకుని జీవో జారీ చేయాలని కోరారు.

నేడు 2కే రన్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం వరల్డ్ హార్ట్ డే ను పురస్కరించుకొని టచ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ ప్లేయర్, డాక్టర్ నైనా జైశ్వాల్, రామగుండం సీపీ రెమా రాజేశ్వరీ, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7గంటలకు ఐబీ చౌరస్తా నుంచి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు 2కే రన్ ఉంటుందని ప్రజలు హాజరు కావాలని కోరారు.

భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగించాలి



నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

పాతమంచిర్యాల: బ్రిటీష్ నిరంకుశ పాలన నుంచి విముక్తి కోసం పోరాడిన విప్లవ వీరుడు షహీద్ భగత్‌సింగ్ అని ఆయనను స్ఫూర్తిగా తీసుకుని, నేటి యువత హక్కుల కోసం పోరాడాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రేంకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రదీప్, శ్రీకాంత్, సంతోష్, రవి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

'ఒక్క అవకాశం ఇవ్వండి'



చీరలు పంపిణీ చేస్తున్న సురేఖ

నస్పూర్: మంచిర్యాల నియోజకవర్గంలో కొక్కిరాల రఘుపతి రావు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిస్వార్థంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం కల్పించాలని ట్రస్ట్ సెక్రటరీ, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ తెలిపారు. పట్టణ పరిధిలోని13, 14, 15, 19, 22, 24, 25 వార్డుల్లో మహిళలకు సద్దుల బతుకమ్మ చీరలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రేంసాగర్‌రావుకు ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం కల్పిస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జన్నారం మండలం కవ్వాల్‌లో శోభాయాత్ర



ముల్కల్లలో భజరంగ్‌దళ్ భక్తుల సందడి



లక్సెట్టిపేట: ఆంధ్రాకాలనీలో...



వేంపల్లిలో శోభాయాత్రలో మహిళల కోలాటం

బై బై..వినాయక

జన్నారం/దండేపల్లి/వేమనపల్లి/భీమిని/లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/చెన్నూర్: జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జన వేడుకలు గురువారం కొనసాగాయి. నవరాత్రులు పూజలందుకున్న గణపయ్యకు భక్తులు నృత్యం చేస్తూ, కోలా టాలు ఆడుతూ.. డప్పు చప్పుళ్లతో వీడ్కోలు పలికారు. అనంతరం సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. లక్సెట్టిపేటలోని ఆంధ్రాకాలనీలో రూ.26,000 అదేకాలనీకి చెందిన వెంకటక్రిష్ణారెడ్డి లడ్డును వేలంలో దక్కించుకున్నారు. హాజీ పూర్ మండలం ముల్కల్లలోని శివగణేశ్ మండలి ఆధ్వర్యంలో గోండుల గుస్సాడీ నృత్యం, శివపార్వతి లంబోదర యూత్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలోని కొమ్ముకోయ గిరిజన నృత్యం ఆకట్టుకుంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.



చెన్నూర్: లక్కీ డ్రాలో విజేతకు స్కూటీ



గూడెం గోదావరిలో క్రేన్ సాయంతో నిమజ్జనం



బిట్టూర్‌పల్లిలో నిమజ్జనానికి తరలిస్తూ..



ముల్కల్ల శివగణేశ్ భక్తమండలి ఆధ్వర్యంలో గిరిజనుల గుస్సాడీ నృత్యం



వేమనపల్లి: శోభాయాత్రలో నృత్యం చేస్తున్న యువకులు



గణనాథుడికి 108 రకాల నైవేద్యాలు

దండేపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ రోడ్డులో నెలకొల్పిన గణనాథుడికి భక్తులు గురువారం రాత్రి ప్రత్యేక పూజలతో పాటు, 108రకాల నైవేద్యాలు సమర్పించారు. దీంతో గణేశ్ మండపం వద్ద భక్తుల సందడి నెలకొంది.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

నస్పూర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పిస్తే పీఎం నరేంద్రమోదీ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ తెలిపారు. రఘునాథ్ వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని సింగాపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ... ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో ఉచితంగా మందుల పంపిణీ, నిరుద్యోగ యువతకు ఉచితంగా కోచింగ్, స్టడీ మెటీరియల్ పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో సత్రం రమేశ్, మధు, నారాయణ, కొండ వెంకటేశ్, సాగర్, రాజు, రాజేష్, సుమలత, తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న రఘునాథ్

బోనమెత్తి.. నిరసన తెలిపి

దండేపల్లి: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేపట్టిన సమ్మె 18వ రోజుకు చేరింది. అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం రిలే దీక్ష శిబిరం నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వరకు బోనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ తల్లికి బోనాలు సమర్పించి, నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

అంగన్‌వాడీలకు బీజేపీ మద్దతు

నెన్నెల: మండలంలో అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు చేస్తున్న సమ్మెకు బీజేపీ నియోజకవర్గ నాయకుడు కొయ్యల ఏమాజీ గురువారం సంఘీభావం ప్రకటించి సమ్మెలో పాల్గొన్నారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్, బీజేపీ మండల ఉపాధ్యక్షులు గట్టు రాజయ్య, గట్టు శివలింగయ్య ,శ్రావణ్‌కుమార్, ఆశ వర్కర్ల యూనియన్ అధ్యక్షులు అరుంధతిలు ఉన్నారు.



బోనాలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

'లాభాల వాటా హక్కు సాధించింది ఏఐటీయూసీనే'

మందమర్రిరూరల్: సింగరేణిలో వచ్చిన లాభాలను ఉద్యోగులకు వాటా కింద పంపిణీ చేసే హక్కు సాధించింది కేవలం ఏఐటీయూసీనే అని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు సుదర్శన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఎలాంటి హక్కు సాధించకపోయినా, గొప్పలు చెప్పుకుంటుందని మండిపడ్డారు. లాభాల వాటా హక్కు సాధించినప్పుడు టీబీజీకేఎస్ సంఘమే పురుడుపోసుకోలేదన్నారు. టీబీజీకేఎస్ పోకడలు కార్మికవర్గం గుర్తిస్తుందని, వచ్చే యూనియన్ ఎన్నికల్లో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

సన్మానం

బెల్లంపల్లి: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడిగా నియామకమైన బెల్లంపల్లికి చెందిన రేణికుంట్ల ప్రవీణ్‌ను గురువారం జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ చైర్మన్ కొమ్ము అశోక్ పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

ప్రమాదకరంగా లోలెవల్ కాజ్‌వే



చెన్నూర్‌రూరల్: మండలంలోని శివలింగాపూర్ నుంచి అక్కెపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో వాగుపై ఉన్న లోలెవల్ కాజ్‌వే మధ్యలో గుంతలు పడి, పగుళ్లు తేలి ప్రమాదకరంగా ఉంది. వాగు ఉప్పొంగిన సమయాల్లో, రాత్రి వేళల్లో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

ఆర్థిక సాయం అందజేత

దండేపల్లి: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొట్టి వెంకటేశ్ ఇటీవలే గుండె ఆపరేషన్ చేయించుకున్నాడు. నిరుపేదకావడంతో వైద్య ఖర్చుల కోసం లక్సెట్టిపేట గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో రూ.11,116 సాయాన్ని గురువారం అతడికి అందించారు.

కోటపల్లి: మండలంలో నక్కలపల్లి గ్రామానికి చెందిన చిన్నారి స్వప్న(11) అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా గ్రామానికి చెందిన యువకులు, పెద్దలు రూ.53వేలను చిన్నారి తమ్ముడి పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను కుటుంబసభ్యులకు అందజేశారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి, కల్మలపేట, ఎస్సీ కాలనీల్లో వైద్యాధికారి రాజేష్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న వారి రక్తనమూనాలు సేకరించి డెంగీ, మలేరియా పరీక్షలు చేసి మందులు అందజేశారు.

కోటపల్లి: మండలంలోని శంకరాపూర్ బారెగూడెంలో కోటపల్లి ఆరోగ్యకేంద్ర వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని 48మందికి పరీక్షలు నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న వారి రక్తనమునాలు సేకరించారు.

కాంగ్రెస్ ప్రచారం

చెన్నూర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పథకాలు అమలు అవుతాయని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ రాజా రమేష్ అన్నారు. మండలంలోని లంబడిపల్లి, బుద్దారం, సంకారం, కత్తెరసాల, బావురావుపేట, ఆస్నాద, అంగ్రాజ్‌పల్లి గ్రామాల్లో గురువారం ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టే పథకాలను ప్రజలకు వివరించారు.

'మంత్రి పర్యటనను అడ్డుకుంటాం'

మందమర్రిరూరల్: అక్టోబర్ 1న అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు మందమర్రికి వస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును అడ్డుకుంటామని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సంజయ్‌కుమార్ తెలిపారు. ఏరియాలోని టీఎన్‌టీయూసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ పాలనలో నిరుద్యోగుల భవిష్యత్ అంధకారమైందని, సింగరేణిలో ఉద్యోగుల సంఖ్య, భూగర్భ గనుల సంఖ్య తగ్గిందని ఆరోపించారు. గత ఎన్నికల ముందు మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహిస్తామని చేసిన వాగ్దానం ఏమైందని ప్రశ్నించారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు షరీఫా, సంపత్, లక్ష్మీరాజం, రాజు, సత్యనారాయణ, జయ, సంధ్య, తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

లక్సెట్టిపేట: మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యలను పరిష్కరించాలని స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దుంపల రంజిత్, మధ్యాహ్న భోజన కార్మికులు రవియా, మల్లక్క, సత్తక్క, లచ్చవ్వ, అమృత, సునీత పాల్గొన్నారు.

'రైతులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం'

కాసిపేట: రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణమాఫీ 45రోజుల్లో అందరి ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి, కొంతమంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసిందని రైతులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందని రైతుసంఘం (ఏఐకేఎస్) జిల్లా కార్యదర్శి బానేశ్ విమర్శించారు. మండలంలోని ముత్యంపల్లిలో గురువారం మాట్లాడారు. తక్షణమే స్పందించి రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని సూచించారు. ముత్యంపల్లి గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మంచర్ల మల్లయ్య, కార్యదర్శిగా ఎల్లయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, రాజం, మొండయ్య, భీమయ్య, సాయికిరణ్, రాజమల్లు, ప్రసాద్, రాజు, పోశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

తాండూర్: మిలాద్ ఉన్ నబీ వేడుకలను మండలంలో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో భాగంగా తాండూర్ జమా మసీదులో బుధవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు, జాగారాం చేశారు. గురువారం ఉదయం పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అక్టోబర్ 1న ర్యాలీ నిర్వహించనున్నట్లు మత పెద్దలు ప్రకటించారు.

ముస్లిం యువకుల రక్తదానం

జన్నారం: మండలంలోని జన్నారం గ్రామ పంచాయతీ సమీపంలోని ఉర్దూ పాఠశాల వద్ద గురువారం మిలాద్‌ఉన్ నబీ సందర్భంగా ముస్లిం యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 50మంది యువకులు రక్తదానం చేశారు. తలసేమియా వ్యాధిగ్రస్తులు, గర్భిణీ స్త్రీలు, క్యాన్సర్ వ్యాధి గ్రస్తులకు ఉపయోగించేందుకు బ్లడ్ డొనేషన్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు అబ్దుల్ రహీంకు సేకరించిన రక్తం యూనిట్లను అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు నయిమ్, సర్పంచ్ గంగాధర్ గౌడ్, ఎంపీటీసీ రియాజోద్దీన్, మాజీ ఉపసర్పంచ్ అజార్, నాయకులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



రక్తదానం చేస్తున్న యువకులు

బెల్లంపల్లి: ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు గురువారం బెల్లంపల్లిలో ఘనంగా జరుపుకున్నారు. ఆల్ ముస్లిం మైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ, ఆల్ ముస్లిం మైనార్టీ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి, సిస్టర్స్ జోప్సిస్, పద్మ చేతులమీదుగా పండ్లు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆల్ ముస్లింమైనార్టీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అన్వర్ ఖాన్, పట్టణ అధ్యక్షుడు రసూల్‌షరీఫ్, నాయకులు జాఫర్, ఖాజా మోహినోద్దీన్, నూరోద్దీన్, హఫీజ్, అశ్రాఫ్‌రజా, తాజ్‌ఖాన్, ఫిరోజ్‌ఖాన్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

నస్పూర్: పట్టణ పరిధిలోని న్యూ నాగార్జునా కాలనీకి చెందిన తిప్పని లింగమూర్తి- రేవతి దంపతుల కుమారుడు తిప్పని దీక్షిత్‌వర్మ సీసీసీలోని శ్రీ సాయి అనాథ వృద్ధాశ్రమంలో స్వీట్లు పంచి అన్నదానం చేశారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

కలుషిత నీరే దిక్కు..!

- సింగరేణి కాలనీల్లో దెబ్బతిన్న పైప్‌లైన్
- ఒకే లైన్‌లో లెట్రిన్, తాగునీటి పైపులు
- ఫిల్టర్ కూడా కావడం లేదని స్థానికుల ఆరోపణ
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని పలు కాలనీల్లో లెట్రిన్ పైప్‌లైన్‌తో పాటు, తాగునీటి పైప్‌లైన్లు ఉండడంతో సింగరేణి యాజమాన్యం సరఫరా చేసే తాగునీరు కలుషితమవుతోందని పలు కార్మిక కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. ఆ నీరు తాగడం వల్ల అనారోగ్యానికి గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కార్మిక కుటుంబాల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, ఒకే గల్లీలో లెట్రిన్, తాగునీరు పైప్‌లైన్ ఉన్నటువంటి గల్లీలను గుర్తించి పైప్‌లైన్ మార్చాలని కోరుతున్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లేదు..?

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో 24వార్డులకు గాను 10వార్డుల్లో సింగరేణి కాలనీలు ఉన్నాయి. మున్సిపాలిటీలోని వార్డుల్లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పైప్‌లైన్ వేశారు. కానీ సింగరేణి కాలనీల్లోని వార్డుల్లో గల సింగరేణి క్వార్టర్‌లకు మిషన్ భగీరథ పైప్‌లైన్ వేయలేదు. సింగరేణి యాజమాన్యం సుమారు యాభై సంవత్సరాల క్రితం కాలనీల్లో వేసిన పైప్‌లైన్ పాడైపోయిందని, గతంలో ఇళ్లకు వెనుక వైపు నుంచి లెట్రిన్ పైప్‌లైన్ పక్కనే ఉందని గమనించి ఇళ్లకు ముందు వైపు నుంచి కొత్త పైప్‌లైన్ వేశారు. కొన్ని కాలనీల్లో పైప్‌లైన్ మార్చకపోవడంతో లెట్రిన్, తాగునీరు పైప్‌లైన్ ఒకే గల్లీల్లో ఉండడం వల్ల, పైప్‌లైన్‌లు పాడైపోయి నీరు బయటకు వచ్చి కలుషితమైన తాగునీరు సరఫరా అవుతోందని కార్మిక కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. సింగరేణి యాజమాన్యం సరఫరా చేసే తాగునీరు ఫిల్టర్ కాకపోవడంతో పాటు మురుగునీరు సరఫరా అవుతోంది. ఇప్పటికైనా అధికారులు కార్మిక కుంటుంబాల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, కార్మిక కాలనీల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్‌తో పాటు లెట్రిన్, తాగునీరు ఒకే గల్లీలో ఉన్నటువంటి పైప్‌లైన్లను గుర్తించి కొత్తగా పైప్‌లైన్ వేయాలని కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి.



ఒకే గల్లీలో ఉన్న లెట్రిన్, తాగునీటి పైప్‌లైన్

శుద్ధమైన తాగునీరు అందించాలి



పట్టణంలోని మూడో జోన్ పోస్టాఫీస్ వెనుక గల్లీలో సుమారు యాభై యేళ్ల క్రితం యాజమాన్యం వేసిన లెట్రిన్, తాగునీరు పైప్‌లైన్ ఉండడం వల్ల అవి పాడైపోయాయి. ప్రస్తుతం ఆ పైప్‌లైన్ల నుంచి వ్యర్థం బయటకు రావడం వల్ల తాగునీరు కలుషితమవుతోంది. కొత్త పైప్‌లైన్ వేయాలని యాజమాన్యానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. మిషన్ బగీరథ పైప్‌లైన్ కూడా సింగరేణి క్వార్టర్స్‌కు వేయలేదు. యాజమాన్యం సరఫరా చేస్తున్న కలుషితమైన తాగునీరే దిక్కవుతోంది. కొత్త పైప్‌లైన్ వేసి శుద్ధమైన తాగునీరు అందించాలి.

– గరిపాక శ్రీనివాస్, పోస్టాఫీస్ వెనుక గల్లీ, మూడో జోన్ మందమర్రి